'ఆంధ్రభూమి' దినపత్రిక - *25.11.1987*

# ఎన్నిక

నా గురించి మీకు తెలీదు.

నేనెలాంటివాణ్ణో మా కంపెనీ 10 వేల ఎంప్లాయిస్‌ని అడగండి. చెబతారు. అయితే భాస్కర్ మాటలు నమ్మకండి, వాడి కరపత్రాలను విశ్వసించండి - అని నేను అనాలి. కాని అనను.

నేను అవినీతిపరుడనట. సొసైటీ సొమ్మంతా గాది కింద పందికొక్కులా మెక్కేస్తున్నానట - ఖండించనుగాక ఖండించను.

ఉద్యోగుల సౌకర్యార్థమై (కార్మికుల సౌకర్యార్థమై అందామనుకుంటే అదెందుకో పెద్ద పదం అనిపిస్తోంది. కార్మికుల స్థాయిని మావాళ్ళెప్పుడో దాటేశారు). కో-ఆపరేటివ్ సంస్థ ఒకటి వుంది మాకు. ఉద్యోగులకి తక్కువ వడ్డీలకి అప్పులిస్తుంది. అంతేకాదు నిత్యావసర వస్తువుల నుంచి ఆడంబర వస్తువుల వరకూ వాయిదాల పద్ధతిపై సరఫరా చేస్తుంది.

నేను ఆ సొసైటీకి సెక్రటరీని. నాతో పాటు మరో నలుగురు డైరక్టర్లున్నారు. ఉన్నప్పటికీ మెజారిటీ ఉద్యోగులు ఏ లోను కైనా, ఏ వస్తువు కోసమైనా నా చుట్టే తిరుగుతారు. ఆ మాటకొస్తే నాతోటి డైరక్టర్లే నా చుట్టూ తిరుగుతారు - ఒక్క భాస్కర్ తప్ప!

సొసైటీకి వాడూ డైరక్టరే. ఏం లాభం? వాడొక మరో ప్రపంచపు మనిషి. రూల్సు రెగ్యులేషన్సు చుట్టూ తిరిగే మరమనిషి.

రూలు ప్రకారం పనులవుతాయా? రూలు ప్రకారం అయితే వున్న లోను తీరితేగాని మళ్ళీ లోను ఇచ్చే వీలు లేదు. తీసుకున్న వస్తువు సొమ్ము పూర్తిగా చెల్లిస్తే గాని మరో వస్తువు ఇవ్వడానికి వల్ల కాదు. నేను రూల్సు పక్కన పెట్టి, లేదా అడ్డదార్లు కొట్టి అడిగిన వారెవరైనా అవనీయండి - ఏ ఒక్కరినీ నిరాశపరచకుండా పంపిస్తాను. తొలి వాయిదా కట్టి మళ్ళా లోను పెడితే 10 రూపాయలు ఇవ్వడానికి అవకాశమున్నా సరే ఇచ్చే ఏర్పాటు చేసేస్తాను. మా ఉద్యోగుల్లో నూటికి ఎనభై మంది ఇలా పది రూపాయలకు అడ్డంగా పరిగెట్టుకు వచ్చేసేవాళ్ళే! నేను ఏ ఒక్కరినీ కాదనను. లేదనను. ఏ ఒక్కరినీ నిరాశపరచను. అలాంటప్పుడు ఉద్యోగులు నా చుట్టూ తిరుగుతారా? భాస్కర్ చుట్టూ తిరుగుతారా?

సొసైటీలో పనిచేస్తే స్టాఫ్‌కీ, డైరక్టర్లకీ నేను ఎంత చెబితే అంత. ఏది చేయమంటే అది చేసేస్తారు - అదిగో, ఒక్క భాస్కర్ తప్ప!

అంతమాత్రాన పనులేం స్తంభించిపోవు. కమిటీ మీటింగుల్లో వాడొక్కడు విభేదించినంత మాత్రాన సరిపోతుందా - డైరక్టర్లంతా నా వైపు!

ఏమాటకామాట చెప్పుకోవాలి. నాకు భాస్కరంటే ఏ మాత్రం ద్వేషం లేదు. కోపం రాదు. ఈ మాత్రం వర్షాలైన కురుస్తున్నాయంటే, ఆ మాత్రం వంటలైనా పండుతున్నాయంటే లోకంలో ఇంకా వీడిలాంటి వాళ్లు అక్కడా, అక్కడా వుండబట్టేనని - నమ్మేవాళ్ళలో నేనొకణ్ణి. ఈ రోజుల్లో కూడా వాడిలాంటి వాళ్ళు వున్నందుకు నమస్కారం పెట్టడం తప్ప మనమేం చేయగలం? నేనూ, మిగతా డైరక్టర్లూ ఎంతో కొంత సంపాదించుకుంటున్నాం. అందులో తప్పు లేదని నా అభిప్రాయం. బోఫోర్స్‌లూ, ఫేర్‌ఫాక్స్‌లూ, వాటర్ గేటులూ వింటున్నాం కదా - అవే నిజమైతే వాటి ముందు మనమేపాటి? దీపం వున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నారు కదా పెద్దలు. చక్కబెట్టుకుంటున్న దర్శనాలూ ఎదురుగా కనిపిస్తాయి.

భాస్కర్ మమ్మల్ని పూర్తిగా చక్కబెట్టుకోనివ్వడూ, వాడూ చక్కబెట్టుకోడూ! తినని వాడు

తిననట్టు వూరుకోకుండా ఒక్కసారిగా నాపై విరుచుకుపడ్డాడు. నేను అవినీతిపరుడనట. సొసైటీ సొమ్ముని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నదీ, సంస్థను నష్టాల ఊబిలోకి ఎలా దింపేస్తున్న... ఒక ఉదయాన్నే కరపత్రాల్లో గుద్దేశాడు. దింపేశాడు. నా గుండె గుభేల్‌మంది.

నేను ఏనాడూ ఎవరికీ జడవనిది - ఆ క్షణం వాడికీ, వాడి కరపత్రాలకీ జడిచేను. వజవజ వణికేను.

చూస్తే రేపో, మాపో ఈ సొసైటీకి ఎన్నికలు జరగబోతున్నాయి. సరిగ్గా సమయం చూసి నన్ను బజార్న పడేశాడు భాస్కర్.

మిత్రులూ, శ్రేయోభిలాషులూ ఆ కరపత్రాన్ని ఖండిస్తూ నన్నొక కరపత్రం వేయమన్నారు. లేదా అధికారికంగా ఒక సర్క్యులర్ జారీ చేయమన్నారు.

నేనాపని చేయలేదు. భాస్కర్ రాసిందాంట్లో ప్రతి అక్షరం నిజం. నిజం. ఆ నిప్పుల జోలికి వెళ్ళడం నాకు ఇష్టం లేక వూరుకున్నాను.

ఎలాగూ రేపు ఎలక్షన్లు వున్నాయి. నా సర్వీసు మళ్ళీ కావల్సిందీ, లేనిదీ ఉద్యోగులే నిర్ణయిస్తారు.

నీతి నిజాయితీ వున్న భాస్కర్‌లు కావాలో లేక అటువంటి వాటితో పనిలేకుండా, వాళ్ళ తక్షణ అవసరాలు 'నో' అనకుండా అడ్డంగా తీర్చగలిగే నా లాంటి వాళ్ళు కావాలో రేపు వాళ్ళే నిర్ణయిస్తారు.

ఎలక్షన్లు వచ్చేసేయి.

పది వేల మందికి పాపం 'సర్వీస్' చేసేయడానికి వంద మంది నించుండి పోయేరు. (ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!) కావాల్సింది అయిదుగురు డైరక్టర్లే!

వంద మంది నించున్నప్పటికీ ఉద్యోగులు ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేకుండా అయిదుగురు డైరక్టర్లను ఎన్నుకొన్నారు.

భాస్కర్ మళ్ళీ ఎన్నికయేడు!

భాస్కర్ ఎన్నిక నన్ను ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తింది. గెలిచింది భాస్కర్ కాదు. నీతి నిజాయితీ, న్యాయం, ధర్మం!

భాస్కర్‌కి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను.

అయితే నేను కూడా గెలిచేను. గెలవడం ఇలా అలా కాదు. అత్యధిక మెజారిటీతో అందరి కన్నా చాలా ఎక్కువ ఓట్లతో గెలిచేను.

మళ్ళీ నేనే సెక్రట్రీని!

భాస్కర్ మళ్ళీ నా పై వాచ్‌డాగ్ అన్నమాట!

నాకు కాపలాకి భాస్కర్‌ని ఎన్నుకొన్నారు. వాళ్ళ తక్షణ అవసరాలు తీర్చడానికి నన్ను ఎన్నుకొన్నారు.

అమ్మో, మా ఉద్యోగులు మేధావులు!